
భట్టిప్రోలు కృష్ణమూర్తి

# తెగదెప్పు - పులితోటు



**పోటీలో కన్సొలేషన్ బహుమతి రూ.500 పొందిన కథ**

రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో ముప్ఫయ్యేళ్ళకు పైగా పని చేసి తాశిల్దార్‌గా రిటైరయిన కోపతి ఉద్యోగాలు చేస్తున్న ముగ్గురు కొడుకుల దగ్గరా ఒక్కొక్క చోట నెలా రెండు నెలలూ, పెళ్లయి కాపురం చేసుకుంటున్న కుమార్తె దగ్గిర రెండు మూడు వారాలూ గడిపి సంవత్సరంలో మిగతా కాలం రాజమండ్రిలో గోదావరి ఒడ్డున కట్టుకున్న సొంత ఇంట్లో భార్యతో పాటు ఉటుంటాడు.

సంక్రాంతి పండుగ ముందు నెలగంట పెట్టడం ఎప్పుడూ రాజమండ్రిలోనే జరుగుతుంది. అయితే ఈ సంవత్సరం మటుకు భార్య పార్వతికి సుస్తీ చేయడం వల్ల స్టేట్ బాంక్‌లో పనిచేస్తున్న



మూడో కొడుకు ఊరినుండి విజయనగరం జిల్లాలో ఒక చిన్న పట్టణంలో డాక్టర్‌గా ఉంటున్న పెద్ద కొడుకు విశ్వనాథం దగ్గరకు డిసెంబర్‌లో వెళ్ళవలసి వచ్చింది రాజమండ్రికి బదులుగా.

కాశీపతికి రేగుపళ్లంటే ఇష్టం — అందులోనూ సొంతంగా ఇంట్లో చెట్టునుండి కోసుకున్న పళ్లంటే మరీ ఇష్టం. అందువల్లనే వాళ్ళు దిగవలసిన స్టేషనుకు రెండు మూడు స్టేషన్ల ముందు ఒక ముసలమ్మ బుట్టలో రేగుపళ్లు అమ్మకానికి వచ్చినప్పుడు కాశీపతి కళ్ళు ఆ పళ్లబుట్ట మీదే నిలిచాయి. కొన్ని క్షణాలు— సొంత ఇంట్లో రేగుపళ్ళు కోసుకొని తినే అవకాశం ఈ సంవత్సరం లేదుకదా అన్న ఆలోచనలో.

బెర్తు మీద పడుకుని ఏదో పత్రిక తిరగేస్తున్న పార్వతి భర్త చూపులు పళ్లబుట్ట మీద బిగించుకొని ఉండడం చూసి నీరసంగా నవ్వుతూ అంది, 'నా మూలాన ఈ సంవత్సరం మనింట్లో రేగుపళ్లు తినే ఛాన్సు పోయింది మీకు'

చూపులు పళ్ల బుట్ట మీది నుండి భార్య మీదకి మరలించి అన్నాడు కాశీ పతి, "ఈ సంవత్సరం కాకపోతే వచ్చేసంవత్సరం తినొచ్చు. నీ ఆరోగ్యం కన్నా ఎక్కువేమిటి వెధవ రేగుపళ్లు"

భర్తకు తనంటే ఉన్న అభిమానం ఆప్యాయతా పూర్తిగా తెలిసిన పార్వతికి ఆమాటలు తృప్తిగా అనిపించాయి. ఆస్పత్రి ఊరు చివర ఒక తోటలో ఉంది. డాక్టర్‌గా విశ్వనాథం ఇంటికి ఒక ప్రక్క కంపౌండర్ క్వార్టర్సూ మరొక వైపు నర్సు క్వార్టర్సూ ఉన్నాయి. అంతకు ముందు ఉండే నర్సు బదిలీ అయిపోయి క్రొత్త నర్సు ఇంకా రాకపోవడంతో ఆ ఇల్లు ఖాళీగా ఉండేది డిసెంబరులో.

రైలు దిగి వచ్చాక నీళ్ళు పోసుకుని బట్టలు మార్చుకుని ఇంటిముందు పూలతోటలో మందార చెట్టు ప్రక్క నీడలో పడక కుర్చీలో కూర్చుని కోడలు ఇచ్చిన కాఫీ త్రాగుతున్న కాశీపతి కళ్లకు నర్సు క్వార్టర్స్‌లో వేలకొద్దీ పిందెలతో నిండి ఉన్న రేగు చెట్టు కనిపించి ప్రాణం లేచి వచ్చినట్లయింది. కాఫీ త్రాగడం పూర్తి చేశాక లేచి రెండిళ్లకూ నడుమ ఉన్న దడి గేటు తీసుకొని ఆ చెట్టు దగ్గరకు వెళ్లి దాని క్రింద నిలబడి తలపైకెత్తి చూశాడు. ప్రస్తుతం చిన్నవిగా ఉన్నాయి కాని ఒక రెండు వారాల కల్లా పక్వానికి వస్తాయి అనుకుంటూ క్రిందు గా వున్న ఒక గుత్తిలో రెండు మూడు పిందెలు కోసుకొని రుచి చూసాడు. రేగు పళ్లంటే బాగా అనుభవం ఉన్న వాడు కనుక నోటికి తగులుతున్న వగరులో దాగుకొని ఉన్న మంచి రుచి కనిపెట్టి జాతి పళ్లే ఇవి అనుకుని సంతృప్తిగా తలపంకించాడు. ఒకసారి కాశీపతి.

భోజనాలు అయ్యాక ముందు వరాండాలో ఎండ పొడలో మంచం వేసుకొని కునుకు తీస్తున్న కాశీపతికి ఎక్కడో దగ్గరలో గణగణ మ్రోగుతున్న గంట వినిపించి మెలకువ వచ్చింది. ఆ దగ్గరలోనే ప్రైమరి స్కూలు ఉందని కోడలు చెప్పిన మాట జ్ఞాపకం వచ్చి ఇంటర్‌వెల్ టైమయినట్లుంది అనుకొని మళ్లీ కునుకు తీయడానికి ఉపక్రమించాడు. అయిదారు నిముషాలు అయిందో లేదో పిల్లల మాటలు కేకలు సంతగోలలా వినిపించి మళ్ళీ కళ్ళు తెరిచాడు. ఉన్నట్లుగా ఉండి రేగు చెట్టు సంగతి జ్ఞాపకం వచ్చి లేచి మెట్లు దిగి వెళ్ళి ప్రక్క ఇంటి వైపు చూసాడు. పాతిక ముప్పయి మంది ఆడా — మగా పిల్లలు రేగు చెట్టు చుట్టూరా మూగి రాళ్ళతో ఆ పిందెల్ని రాలగొడ్తున్నారు. మనస్సు కలుక్కుమనిపించి దగ్గరకు వెళ్లి గట్టిగా అదిలించాడు వాళ్లను బెదిరిపోయిన వాళ్లు చెల్లా చెదరై పారిపోయారు కాని ఒక పన్నెండేళ్ల పిల్ల మాత్రం చెట్టుకు కొద్ది దూరంలో నిలబడి కాశీపతి వైపు చురచురా చూస్తూఅంది: 'ఈ ఇంట్లో ఎవళ్ళూలేరు — ఖాళీయే కదండి! పళ్లు కోసుకుంటే ఏమి?'

ఆ అమ్మాయి వైపు వింతగా చూసి అన్నాడు కాశీపతి: 'ఖాళీగా వుంటే మటుకు? వగరుపిందెలు రాలగొడ్తారా ఏమిటి? పనికి రాదు — ఇదంతా మా హస్పిటల్ ఆవరణ'

ఆ పిల్ల మూతి విరిచి వెళ్లిపోతూ అతనికి వినిపించేలా గొణిగింది ! 'ఓ యబ్బ — ఆస్పత్రంతా తానే కట్టించి ఈ చెట్లన్నీ తానే నాటినట్టు మాట్లాడు తుండారు తాతగారు?'

సూటిగా చెప్పిన ఆ నిజానికి కొద్దిగా కోపం వచ్చింది కాశీపతికి కాని ఏమి అనకుండా ఆ పిల్ల దూరంగా వెళ్లి పోయినంతవరకూ ఆ వైపే చూసి వెనక్కు తిరిగి వచ్చి మంచం మీద కూర్చుంటూ నెలపైగా ఎవరూ లేక పోవడం వల్ల పడిపోయిన నర్స్ క్వార్టర్స్ దడి అబ్బాయికి చెప్పి సరిగా కట్టించి ముళ్ళ కంచెలు వేయించాలి, లేకపోతే ఈ మిడతల దండు రేగు చెట్టును బ్రతకనివ్వరు అనుకున్నాడు మనసులో.

ఇంకో అయిదు నిముషాలకు సంత గోల మళ్ళీ వినవచ్చి వరండా చివరకు వెళ్లి చెట్టు చుట్టూ మూగిన పిల్లలను చూసి విసుగుతో గట్టిగా కేక పెట్టాడు అతడు. పిల్లలు చెల్లాచెదరై పారి పోయారు మళ్ళీ. ఇంటర్‌వెల్ పూర్తి అయ్యేంత వరకూ ఇలాగే జరిగింది నాలుగైదు సార్లు. దాంతో మరి ఆ మధ్యాహ్నం కునుకు తీసే అవకాశం తప్పి పోయింది కాశీపతికి.

సాయంత్రం నాలుగు గంటలకు స్కూలు వదిలి పెట్టినప్పుడు కూడా ఒక అరగంట వరకు ఆ చెట్టు దగ్గరే నిలబడి దాన్ని కాపాడు కోవలసి వచ్చింది అతడు. ఆ రాత్రి నర్సు ఇంటి దడి బాగు చేయడం గురించి తండ్రి అన్నది విన్న విశ్వనాథం రేగుపళ్లంటే కాశీపతికి ఉన్న ఆప్యాయత బాగా తెలిసినవాడు కనుక లోలోపల నవ్వు కొని 'అలాగే నాన్నా' అన్నాడు.

మరునాడు ఉదయం ఆస్పత్రి




కౌగిలి


"పదేళ్ళ క్రితం అతని ప్రక్కన హీరోయిన్‌గా నటించారు. ఇప్పుడు అతనికి తల్లిగా నటిస్తూమీరెలా ఫీలవుతున్నారు?" అడిగాడు విలేఖరి నటి విజయమ్మని.

"అప్పుడు ప్రియా అంటూ కౌగలించుకునేవాడు, ఇపుడు అమ్మా అంటూ కౌగలించుకుంటున్నాడు. అప్పుడూ ఇప్పుడూ అదే మనిషి. అదే బిగి కౌగిలి." అంది విజయమ్మ.

— జె. భాస్కర పట్నాయక్ (శ్రీకాకుళం)

ఎక్స్‌పెరిమెంట్ gopisetty..






"మా నాన్నగారు గొప్ప సైంటిస్ట్. పదడుగుల పొడుగు, నాలుగడుగుల వెడల్పు గల ఓ సబ్బు తయారు చేసారు" అన్నాడు కిషన్.

"మరి దాంతో ఒళ్ళు రుద్దుకోవడం ఎలా?" అడిగాడు హరి.

"రుద్దుకోవడం ఏమిటి నీ మొహం, ఆ సబ్బు మీద రెండు చెంబులు నీళ్ళు పోసి అటూ ఇటూ పొర్లితే చాలు!" అన్నాడు కిషన్.

—ఎస్. వాహిద్ (బొంబాయి)

వార్డు బాయిలు ఇద్దరు వచ్చి నర్సు ఇంటి దడి బాగు చేసి ముళ్ల కంచెలు వేశారు దట్టంగా.

అయితే ఆ రోజు మధ్యాహ్నం కూడా నిద్ర పోవడానికి అవకాశం దొరకలేదు కాశీపతికి. రేగు చెట్టు కొమ్మలలో సగభాగం దడికి అవతలే వ్రేలాడుతూ ఉండడంతో ఇంటర్ వెల్‌లో పిల్లలువచ్చి చెట్టు మీదికి రాళ్లు విసరడమూ అతడు వాళ్లను అదిలించడమూ అయిదు ఆరు సార్లు జరిగింది.

ఆ సాయంత్రం ముందు పూల తోటలో లాన్‌లో కూర్చుని కాఫీ త్రాగుతూ వున్నప్పుడు పార్వతి అంది నవ్వుతూ భర్తతో: 'రిటైరై ఇంట్లో కూర్చున్నందుకు మంచి ఉద్యోగమే దొరికింది మీకీ ఊళ్ళో — రేగు చెట్టుకి కాపలా'.

తానూ నవ్వి అన్నాడు కాశీపతి: 'మరెన్నాళ్ళా? సంక్రాంతి పండుగ ముందే పక్వానికొచ్చేస్తాయి పళ్లు.'

'అంతవరకూ మధ్యాహ్నం నిద్ర పోకుండా కూర్చుంటారా, ఆ పిల్లల్ని బెదిరిస్తూ? పాపం, రేగు చెట్టూ జాను చెట్టు అంటే పిల్లలకి సరదా.'

సరదా కాదని అనడం లేదు — కసరు పిందెలు ! రేపు కోసి నేనే ఇస్తాను వాళ్లకి తినండర్రా అని, పక్వానికొచ్చా కా.'

మంగళ వారం ఆ ఊరికి వచ్చిన కాశీపతికి శనివారం మధ్యాహ్నం హాయిగా నిశ్చింతగా పడుకోవడానికి వీలుకలిగింది కాని ఆ మరునాడు ఆదివారం ఆ ఊళ్లో సంతకావడంతో ఆస్పత్రి ఆవరణలో నుండే సంత బయటకి అడ్డదారి ఉండి వచ్చే పోయే వాళ్లందరి బారినుండి ఆ రేగు చెట్టును కాపాడుకోవలసిన భారం అతడి మీద పడి నిద్ర లోపించింది ఆ పూట కూడా.

మొత్తం మీద ఎలాగైతేనేమి కాపు లో పదోవంతు రాళ్ల దాడికి గురైనా తక్కిన తొమ్మిది వంతులూ పది రోజుల పాటు నిలబెట్టాడు కాశీపతి. అక్కడక్కడ దోరగా పండిన పళ్లు కొన్ని గడకర్ర పెట్టి జాగర్తగా పసరు పిందెలు రాలిపోకుండా అప్పుడప్పుడు కోసి తాను కొన్ని రుచి చూసి తక్కినవి కొడుకు కోడలికి అయిదేళ్ల మనుమడికి పంచిపెట్టేవాడు. పథ్యంలో ఉండడం వలన పార్వతికి మటుకు ఇచ్చేవాడు కాదు.


పదకొండవ రోజున తోటలో మందార చెట్టునీడలో కూర్చుని కాఫీ త్రాగుతుండగా కాశీపతికి నర్సు ఇంటి దడి ముందు ఏదో కలకలం విని పించింది. లేచి నిలబడి చూసిన అతని గుండె ఒకసారి ధన్‌మని ఆగినంత పని అయింది.

క్రొత్తగా ఆ ఊరి ఆస్పత్రికి పోస్టింగ్ అయిన నర్స్ సామాన్లతో కుటుంబంతో నాలుగు రిక్షాల్లో వచ్చి ఆ ఇంటి ముంగిట దిగింది. రెప్ప వేయ కుండా వచ్చిన వాళ్ల వైపు చూసి ఆ తరువాత రేగు చెట్టు వైపొకసారి చూసి కుర్చీలో కూర్చున్నాడు కాశీపతి. దొంగలు పడి ఇల్లంతా దోచుకొని పోయిన తర్వాత ఇంటివాళ్లకు దిగులుగా అనిపిస్తున్నట్లుగా అనిపిస్తున్నది అతనికి ఇప్పుడు. స్టూలు మీద చల్లారి పోతున్న కాఫీ కప్పు వైపు చూస్తూ అలాగే కూర్చున్నాడు చాలా సేపు.

ఆ మధ్యాహ్నం పది పన్నెండేళ్ల వయస్సున్న నర్సు కొడుకు లిద్దరు రేగుచెట్టు కాపలా భారం వహించడం తో కాశీపతికి ఆ పని తప్పి పోయింది కాని నిద్రమటుకు పట్టలేదు. ఏదో ఇంగ్లీషు నవల చదువు కోవడంలో రేగు చెట్టు గురించి ఆలోచన మనస్సులో అడుగుకు త్రొక్కి కోడానికి ప్రయ త్నం చేశాడు.

నర్స్ సుశీల భర్త శృంగవరపు కోటలో స్కూలు టీచరు. ఆమెకు ఇద్దరు కొడుకులు ఒక కుమార్తె సంతానం. పిల్లలతో డెబ్బయి ఏళ్ళ అత్తగారు లక్ష్మమ్మతో, తమ మీదే ఆధారపడి ఉన్న భర్త మేనత్త సీతమ్మ తో ఉంటుంది. ఆమె తన ఉద్యోగ స్థలంలో. అప్పుడప్పుడు భర్త వచ్చి వెళ్తుంటాడు.

వదినా మరదళ్లు లక్ష్మమ్మా సీతమ్మా ఉత్తప్పుడల్లా మాటిమాటికీ వాదించుకుంటూ ఉంటారు ఎందుకో ఒకందుకు— పచ్చగడ్డి వారిమధ్య వేస్తే భగ్గుమని మండుతూందా అన్నట్లుగా ఉంటు ంది అప్పుడు. కాని దేవుడి పూజ అంటే మటుకు ఇద్దరికీ చాలా పొత్తు కుదురుతుంది. పూలు కోసి తీసుకు రావడమూ, పూజాసామగ్రి విగ్రహాలూ వగైరా తళతళలాడేలా తోముకోవడమూ, దేవుడి గదిలో ముగ్గులు పెట్టడమూ, తెచ్చిన పూలు రేకురేకులూ త్రుంచి ఒక్కొక్క రేకుకే గంధం పసుపూ రాసి అక్షింత గింజ ఒకటి అంటించి పూజ కోసరం సిద్ధం చేసుకోవడమూ — వీటిలో ఒకరి కొకరు ఎంతో సాయంగా వుండి, ఇంత ఆత్మీయులు ప్రపంచంలో మరి ఉండరేమో అన్నట్లుగా ఉంటారు వాళ్లు ఆ సమయంలో. తెల్లవారు ఝామున లేచిన ఆ ముసలి



వాళ్లిద్దరికీ వంటా వార్పూ, పిల్లలకు భోజనం పెట్టడమూ ఆ తరువాత పూజా పీటితో మధ్యాహ్నం మూడు గంటల వరకూ కాలం గడుస్తుంది. ఆ తరువాతే వారి భోజనం.

చాలా రోజులు ఎవరూ లేక పోవడంతో నర్సు ఇంటి ముందు ఏ మొక్కలూ లేకుండా బోడిగా ఉంటుంది. అందువల్ల వాళ్ళ పూజకు డాక్టరు గారి పూల తోటలో పూతే ఆధారం అయ్యాయి.

డాక్టరు విశ్వనాధానికీ అతని భార్యకూ పూలతోటుంటే శ్రద్ధలేదు కాని ఆస్పత్రి మాలీ బాగా శ్రద్ధ తీసుకోవడం వల్ల వాళ్ళ తోటలో రకరకాల పూలు ఎప్పుడూ నిండుగా ఉంటాయి — మందారా, నందివర్ధనం, రాధామనోహరం, వెయ్యి వరహాలు, బిళ్లగన్నేరు, గులాబీ, కనకాంబరం, మొదలైన వన్నీ.

రేగు పళ్ళంటే ఉన్న జిహ్వా చాపల్యంతో పాటు మంచి కళాత్మకమైన దృష్టి కూడా ఉంది కాశీపతికి. పూల మొక్కల నడుమ తిరుగుతూ ఆ అందాలని చూస్తూ ఎన్ని గంటలయినా గడిపేయ గలడు అతడు. అందువల్లనే ప్లాటు లోనూ అద్దెవాటాలోనూ ఉంటే తక్కిన కొడుకుల దగ్గర కన్నా పెద్ద కొడుకు దగ్గరా, రాజమండ్రిలో తన ఇంట్లోనూ ఎక్కువ కాలం ఉండడానికి ఇచ్చగిస్తాడు అతడు. సొంత ఇంట్లోనూ మంచి పూల తోట ఉంది అతనికి. తాము లేనప్పుడు నీళ్లూ గట్రా పోసి జాగ్రత్తగా చూడడానికి నెలకు పదిహేను రూపాయలిచ్చి ఒక మనిషిని పెట్టుకున్నాడు రాజమండ్రిలో.

నర్సు సుశీల వచ్చిన మరునాటి ఉదయం మందార చెట్టు నీడలో — కుర్చుని కాఫీ త్రాగుతున్న కాశీపతికి తోటంతా బోడిబోడిగా కనిపించి ఆశ్చర్యంగా నలువైపులా చూశాడు. ప్రతీ పూల మొక్కకీ ఏదో ఒకటీ అరా తప్ప పూలే లేవు. ఏమైంది చెప్మా అనుకుంటూ లేచి నిలబడి చూస్తున్న అతనికి ఆపక్కింటి ముసలి వాళ్లిద్దరూ దూరంగా ఉన్న వెయ్యి వరహాల చెట్టు దగ్గర పెద్ద పెద్ద పూల సజ్జలతో కనిపించారు. ఓహో ఇదా సంగతి అనుకున్నాడు— పట్టరాని కోపం వచ్చింది రేగు చెట్టు మీది తన హక్కు పోయింది అని అసలే అక్కసుతో ఉన్న అతనికి. రేగు చెట్టు మీద దాడి చేసే పిల్లలని అదలించినట్లుగా ఈ ముసలి వరదులనీ అదలిద్దామని అనుకున్నాడు గానీ అంతలో దేవుడి పూజకు పూలు కోసుకుంటున్న వాళ్లని అలా అనడం బాగు ఒడదేమో అనిపించి కోపం దిగ మ్రింగి మళ్లా కూర్చున్నాడు కుర్చీలో.

మధ్యాహ్నం భోజనాలప్పుడు కోడలు జానకితో ఈ సంగతి చెప్పినప్పుడు ఆమె అంది: 'నేనూ అదే అనుకున్నాను— అడగా నుడగా కుండా ఏమిటూ పూలుకోసుకోవ డమని ::: వీలు చూసి ఆనర్సుతో చూచా యగా చెప్పాను—'

పార్వతి అంది: దేవుడి పూజకే కదూ — వద్దంటే బావుండదమ్మా.'

జానకి అంది: 'అసలొద్దనటం లేదత్తయ్యా— ఏదో కొద్దిగా కోసుకో వచ్చుకానీ తోటంతా బోసిగా చేసెయొద్దని ఇన్ డైరెక్ట్‌గా చెప్తాను'

మరునాడుదయం కాశీపతి కళ్లకు తోట ఇంకా బోడిబోడిగా కనిపించింది. క్రితం రోజుకన్నా కొంత నయంగాని మొత్తం మీద చాలా పూలు కోసుకు పోయినట్లున్నారు అనుకున్నాడు మనసులో. కోడలు చూచా యగా చెప్పిన మాటలు అంతగా పనిచేసినట్లు లేదు; తానే స్వయంగా ఒక కన్ను వేసి ఉంచితే మంచిది అనుకున్నాడు.

దేవుడి పూజ అలవాటు ఉన్న వాళ్లకు పూలూ, ప్రతీ పూజకు కాకపోతే మరెందుకు సృష్టించాడు దేవుడు అనిపిస్తుంది — కోయకుండా చెట్ల మీదే వదిలి వాటి ప్రకృతి ధర్మం అవి నెరవేర్చుకోనిస్తేనే దేవుడికి — సృష్టి కర్తకు — ఎక్కువ ఆనందం అని స్ఫురించదు వాళ్ళకు. పై వాళ్ల ఇళ్లలో చొరబడి వాళ్ల అనుమతి లేకుండా పూలు కోసుకోవడమూ వాళ్ల దృష్టిలో తప్పుకాదు. సీతమ్మ లక్ష్మమ్మల మనః ప్రవృతి ఇదే. అయితే ప్రక్కింటి ముసలాయనకు పూలంటే ప్రాణమనీ అందువల్ల డాక్టర్ గారింట్లోకి వెళ్ళి ఎక్కువగా పూలు కోయవద్దనీ నర్సు సుశీల చెప్పడం వల్ల వాళ్ళు ముసలాయన తోటలో ఉన్నప్పుడూ వరండా మీద కూర్చున్నప్పుడూ ఆ లోపలికి రాకుండా తెల్లవారు ఝామున బాగా చీకటిగా ఉన్నప్పుడే పూలు కోసుకు పోవడం మొదలు పెట్టారు. అంతే కాకుండా కాశీపతి స్నానానికీ కాలకృత్యాలకీ వెళ్లినప్పుడు కూడా పెరుపు దాడిగా వచ్చి పూలు కోసుకునేవారు. అయితే కాశీపతి పొడగాని కనరాగానే తుర్రున అవతలికి వెళ్లిపోయేవారు.



### చిక్కు సమస్య


"ఒకవేళ నేను చచ్చిపోతే మళ్ళీ పెళ్ళి చేసుకుంటారా?" అడిగింది కాంతం.


"ఇది చాలా చిక్కు సమస్య. నేను జవాబు చెప్పలేను." అన్నాడు సుందరరావు.

"ఏం? ఎందుకని?"

"చేసుకుంటావనంటే నువు బాధ పడతావు. చేసుకోనంటే ఆవిడ బాధ పడుతుంది." అన్నాడు సుందరరావు.

—డి. శ్రీనివాసరెడ్డి (సూర్యాపేట)





## కాషియర్

"కాషియర్ పోస్టు ఎవరికిద్దామని ఆలోచిస్తున్నా!" అన్నాడు మేనేజర్ ముకుందం.

"అప్పారావు కిద్దాం!" అన్నాడు గుర్నాథం.

"ఏం?" అడిగాడు మేనేజరు.

"అతనికి అప్పులు ఎక్కువవున్నాయి."

"అయితే?"

"అతను ఒక వేళ కాష్‌తో పరారీ అయితే అతనికి అప్పులిచ్చిన వాళ్ళు కూడా వెతకడంలో సాయపడతారు." అన్నాడు గుర్నాథం.

—బి.వి.యస్. బాబు (తెనాలి)

ఒక్క కళాత్మక దృష్టి మట్టుకే కాక వాళ్లు వచ్చినప్పటి నుండి తన కక్కడి రేగు చెట్టుతో సంబంధం తెగిపోయిందని ఉక్రోషంగా ఉన్న కాశీపతికి ముసలమ్మలిద్దరి మీదా రోజు రోజుకీ కోపం ఎక్కువ కావడం మొదలు పెట్టింది. మామూలుగా తెల్లవారుతున్నప్పుడే నిద్ర లేచే అతడు వాళ్ల బారి నుండి పూలు కాపాడడానికి కంకణం కట్టుకుని తానూ బాగా చీకటిగా ఉండగానే లేచిపోయి తోటలో పచార్లు మొదలు పెట్టాడు. దాంతో పాలూ పెరుగూ మూతలు పెట్టుకుని తలుపులు జాగ్రత్తగా వేసుకునే ఇల్లాలికీ పిల్లికీ మామూలుగా జరిగే ప్రచ్ఛన్న యుద్ధం కాశీపతీ సీతమ్మా లక్ష్మమ్మల మధ్య మొదలైంది. ఒక రోజు రాత్రి రెండు గంటలకే లేచి మొగ్గల అవస్థలోనే పూలన్నీ కోసుకుని వెళ్ళిపోయారు వాళ్లు. ఆ మరునాటి రాత్రి కాశీపతి తానూ రెండు గంటలకే లేచి తోటలోనికి రావడంతో వాళ్ల బెదిరిపోయి వడివడిగా పారిపోయారు. ఏమైనా మొత్తం మీద గెలుపు మహిళలదే అయేది చాలాసార్లు.

నెల రోజులు గడిచాయి. రేగు చెట్టు పూర్తిగా బోసిగా అయిపోయింది. నర్సు సుశీల రెండు మూడు సార్లు రేగు పళ్లు కోసి డాక్టరు గారింటికి ఇచ్చింది కాని కాశీపతి మట్టుకు అవి ముట్టుకోలేదు.

ఆ రోజు రాత్రి రెండు గంటలకు ఒకసారి లేచి తోటల్లో ముసలమ్మల అలికిడి లేదని తెలుసుకున్నాక కాశీపతి వెళ్లి మళ్లీ పడుకుని తెల్లవారు ఝామున లేచి తోటలో ముసులమ్మల అలికిడి లేదని తెలుసుకున్నాక కాశీపతి వెళ్ళి మళ్ళీ పడుకుని తెల్లవారు ఝామున లేచి తోటలోనికి వచ్చి పచార్లు చెయ్యడం మొదలు పెట్టాడు. అన్ని చెట్ల మీదా పూలు నిండుగానే కనిపించి ఆశ్చర్యం వేసింది అతనికి. ఉదయం కాఫీ తాగుతున్నప్పుడూ ఎక్కడిపూలు అక్కడే కలకలలాడుతూ కనిపించి మరింత ఆశ్చర్యమైంది.

ఆ తరువాత తెలిసింది కోడలి ద్వారా — సుశీల అత్త గారికి అంతకు ముందు రోజు సాయంత్రం నుంచి జ్వరంగా ఉందనీ అందువల్ల ఈ ఉదయం పూజకు సన్నాహాలు చేసుకోవటం లేదనీ, సీతమ్మ కూడా వదిన మంచం దగ్గరే రాత్రి నుండీ దిగులుగా కూర్చుందనీ.

ఈ వేళ మరి ముసలమ్మలు తోట మీద పడరు అని కొంత తృప్తిగా అనిపించినా కాశీపతికి తోటకాపలా పని లేక పోవడం కొద్దిగా వెలితిగా అనిపించింది ఆరోజు.

ఆ మరునాడు కూడా ముసలమ్మలు పూలు కోసే ప్రయత్నం చేయక పోవడంతో రిటైరయిన క్రొత్తలో అనిపించినట్టుగా అనిపించి బాగా చికాకుగా అయింది కాశీపతికి. మళ్లీ వాళ్లు తెల్లవారు ఝామునే పూలు కోరకోడానికి వస్తే బావుండును అనుకున్నాడు అతడు చాలా సార్లు.

డాక్టరు విశ్వనాథం లక్ష్మమ్మను చూడడానికి నర్సు, ఇంటికి వెళ్లి వచ్చినప్పుడల్లా కొడుకును 'ఎలా ఉంది అబ్బాయి?' అని ఆదుర్దాగా ప్రశ్నించేవాడు కాశీపతి. పార్వతి నవ్వుతూ అంది ఒకసారి: 'వాళ్ల పేరెత్తుతేనే విసుక్కునే వాళ్లిది వరకు— అంతాదుర్దా పతుడున్నారెందుకు?'

'పూలు కోసుకు పోతున్నారని చిరాకు పడ్డంత మాత్రాన నాకేమన్నా విరోధమా వాళ్లంటే? మా అక్కగారిలా అనిపిస్తుంది ఆవిడని చూస్తుంటే'.

ఆ మరునాడు రాత్రి భోజనాలప్పుడు నర్సు పెద్ద కొడుకు హడావుడిగా పరుగెత్తుకు వచ్చి వాళ్ల నాయనమ్మ స్పృహతప్పిపోయిందనీ వెంటనే రమ్మనీ డాక్టరు విశ్వనాథాన్ని పిల్చుకు వెళ్లాడు.

కాశీపతి సరిగ్గా భోజనం చేయకుండా లేచిపోయి తోటలో వరండా మెట్ల దగ్గర నుండి నర్సు ఇంటి దడి వరకూ కాలుగాలిన పిల్లిలా పచార్లు చేయడం మొదలు పట్టాడు; కొడుకు తిరిగి వచ్చేంత వరకూ.

విశ్వనాథం గేటు తీసుకుని లోపలకు అడుగు పెట్టగానే అడిగాడు అతడు: ఎలా ఉందబ్బాయికి?'.

'పెద్ద వయసు — ఆ రాత్రి గడవడం అనుమానమే!' అని పెదివి విరిచాడు విశ్వనాథం.

కాశీపతి గుండె ధన్‌మంది.

ఆ రాత్రి ఒంటి గంటకు శాశ్వతంగా కన్ను మూసింది లక్ష్మమ్మ.

—నిద్ర సరిగా పట్టని కాశీపతి తెల్లవారు ఝామునే లేచి నీళ్లు పోసుకుని పెద్ద ప్లాస్టిక్ బుట్ట తీసుకు వెళ్లి తోటలో నీ పూలన్నీ ఇంచుమించు ఒక్కటన్నా మిగలకుండా కోసి దాని నిండా నింపుకుని తెల తెల వారుతుండగా నర్సు ఇంటి వెళ్లి అక్కడ వరండాలో పడుకో బెట్టిన కళేబరం మీద ఆ పూలు విరజల్లి చేతులు ముట్టుకుని కళ్ళకు అద్దుకున్నాడు. *

తప్పనాదా!

AVM

